క్లుప్తంగా

బలివే ఉత్సవాలకు శ్రీకారం



ముసునూరు: చారిత్రక ప్రసిద్ధ బలివేలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివ రాత్రి ఉత్సవాల ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఇప్పటికే నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేసి, భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. తాజాగా ఆలయ ప్రాంగణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం శుభ ఘడియల్లో ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కర్, చావలి అమర్‌బాబు మంత్రోచ్చారణల నడుమ భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు. పందిరి రాట (గుంజ)వేసి పందిర్లు, క్యూలైన్ల ఏర్పాటు పనులు ఆరంభించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈఓ పామర్తి సీతా రామయ్య, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్ విధానం రద్దు చేయాలి



నూజివీడు: కామన్ పీజీ సెట్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నంబరు 77ను రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నూజివీడులోని డీఏఆర్ కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రాకపోవడంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమైపోతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్, నేడు విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తూ విద్యార్థుల సమస్యలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కోశాధికారి ఎం.క్రాంతి కుమార్, నాయకులు నవీన్, చిన్ను, వరుణ్, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత



మైలవరం: మండలంలోని పొందుగల గ్రామంలో ఎంపీపీ స్కూల్, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు విజయవాడకు చెందిన దాత శివకుమార్ మధ్యాహ్న భోజనం ప్లేట్లను సోమవారం అందజేశారు. దాత శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని జ్యోతి ఆధ్వర్యంలో దాత 25 మంది విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు పీ శ్రీనివాసరావు, సతీష్, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ డొంకెన చలపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి



నూజివీడు: క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని, ఈ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోనేరుపేట యూపీహెచ్‌సీ వైద్యాధికారి కొలుసు సౌమ్య పేర్కొన్నారు. క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కోనేరుపేట యూపీహెచ్‌సీలో క్షయ వ్యాధిపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వద్దకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకొని తగిన మందులు వాడితే ఆరు నెలల్లో క్షయ వ్యాధి తగ్గిపోతుందన్నారు. మందులను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. టీబీ క్లినిక్ సిబ్బంది జగన్, జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట

మైలవరం: స్థానిక శ్రీకార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ట మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద నవధాన్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీఅభయాంజనేయ స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

వరద పోటు.. రియల్‌కు తలపోటు

- రియల్ ఎస్టేట్ వ్యాపారానికి బుడమేరు వరద దెబ్బ
- భూములు కొనేందుకు వెనకాడుతున్న వ్యాపారులు
- బుడమేరు ప్రక్షాళనను గాలికొదిలేసిన ప్రభుత్వం
- ప్రభుత్వ భరోసా లేకపోవడంతో ఆందోళనలో రైతులు



బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో నీట మునిగిన మైలవరం (ఫైల్)

జి.కొండూరు: రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న మైలవరం నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మందకొడిగా సాగుతోంది. బుడమేరుకు వరద ఉధృతి రాకముందు వరకు క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలలో కురిసిన భారీ వర్షాలకు బుడమేరుకు వరద పోటెత్తడంతో నియోజకవర్గంలో లోతట్టు ప్రాంతాలన్నీ సముద్రాన్ని తలపించాయి. నాడు జనం పడ్డ ఇబ్బందులు రియల్ ఎస్టేట్ వ్యాపారంపై వ్యతిరేక ప్రభావం పడింది. రైతులు కుటుంబ అవసరాలకు భూములు అమ్మలేక, సాగు చేయలేక సతమతమవుతున్నారు.

బుడమేరు ప్రభావం ఇలా..

గత ఏడాది ఆగస్టు 31న భారీ వర్షాల కారణంగా బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణానది వరకు 11.90 కి.మీ మేర ఉన్న బుడమేరు డైవర్షన్ కాల్వకు ఎడమ వైపు మూడు చోట్ల, కుడి వైపున ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. తిరువూరు, మైలవరం నియోజకవర్గాల పరిధిలోని 70కి పైగా చెరువులకు గండ్లు పడి ఆ వరద కూడా బుడమేరులో కలిసి ప్రవహించింది. వరద ప్రవాహానికి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్‌కు ఎగువ భాగాన అంటే బుడమేరు పుట్టిన ఎ.కొండూరు మండల పరిధి దర్గం కొండల నుంచి రెగ్యులేటర్ వరకు 42 కి.మీ మేర చిన్న, పెద్ద కలిపి 65 గండ్ల వరకు పడ్డాయి. వీటి వలన మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలు పూర్తిగా నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

దీని వలన ప్రస్తుతం ఈ ప్రాంతాలలో భూములు కొనేందుకు వ్యాపారులు వెనకాడుతున్నారు. బుడమేరు ప్రక్షాళన చేస్తానన్న ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. వరదలు రాక ముందు ఈ ప్రాంతాలలో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు ధర పలికేది. ఇప్పుడు కుటుంబ అవసరాలకు భూమి అమ్ముకుందామనుకున్నా కొనేవారు లేరు. వెంచర్లు వేసేందుకు గతంలో కొనుగోలు చేసిన భూములు సైతం వెలవెలబోతున్నాయి.

ప్రభుత్వం భరోసా ఇస్తేనే..

బుడమేరు ప్రక్షాళన చేస్తామంటూ మొదటి దశ పనులకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు వేసిన ప్రభుత్వం, ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడంతో మైలవరం నియోజకవర్గంలో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వరద భయం, మరో వైపు భూములు కొనేవాళ్లు లేక దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

ఇలా చేస్తేనే భవిష్యత్తు..

వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఎగువ భాగం బుడమేరులో అక్రమణలు తొలగించడంతో పాటు ప్రవాహ సామర్థ్యం పెంచాలి. ప్రమాదకరమైన మలుపుల వద్ద కాంక్రీట్ వాల్‌ను నిర్మించాలి. హెడ్ రెగ్యులేటర్ నుంచి కృష్ణానది వరకు ఉన్న 11.90 కి.మీ డైవర్షన్ కెనాల్‌ను ప్రవాహ సామర్థ్యం పెంచేలా ఆధునికీకరించాలి. ఈ పనులను ప్రభుత్వం వెంటనే ప్రారంభిస్తే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోదంటున్నారు రైతులు.

భూములు కొనేవాళ్లే లేరు..



బుడమేరుకు వరద రాక ముందు ఎకరం భూమి రహదారి పక్కన అయితే రూ.కోటిన్నర పలికేది. కొంచెం లోపల అయితే రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు ఉంది. ప్రస్తుతం కొనేవాళ్లే రావడంలేదు. బుడమేరు వరద వలన నేను ఆరు ఎకరాల్లో వరి పంట నష్టపోయాను. రెండో సారి నాట్లు వేశాం. బుడమేరు ప్రక్షాళనపై ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంటేనే భూముల ధరలు ఊపందుకుంటాయి. రైతులు ధైర్యంగా సాగు చేయగలుగుతారు.

– దొడ్డా విష్ణువర్ధన్‌రావు, రైతు, ఆత్కూరు, జి.కొండూరు మండలం

మునిగే భూములకు అంతరేట్లా ..



మా గ్రామ శివారులో రహదారి పక్కన ఎకరం రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు చెబుతున్నారు. కానీ కొనేవాళ్లు ముందుకు రావడంలేదు. వరద వస్తే మునిగే భూములకు అంత రేట్లు పెట్టలేమంటూ వెనక్కి పోతున్నారు. బుడమేరు ప్రక్షాళనపై ప్రభుత్వం ప్రణాళికను ప్రకటించి పనులు ప్రారంభిస్తే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకునేలా లేదు.

– యర్రగుంట సుకుంద్, రియల్ ఎస్టేట్ ఏజెంట్, వెలగలేరు, జి.కొండూరు మండలం

ఆప్కాస్ రద్దును ప్రతిఘటించాలి

ఇబ్రహీంపట్నం: ఆప్కాస్‌ను రద్దు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కార్మికులు ప్రతిఘటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మార్చి 6 వరకు నిరసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులకు ఆప్కాస్‌పై అవగాహన కల్పించారు. మున్సిపాల్టీలో ఆప్కాస్‌ను రద్దు చేసి, పనులను బడా కాంట్రాక్ట్ సంస్థకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. సమానవేతనం అమలు చేయాలని, మరణించిన కార్మికుల కుటుంబీకులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు వైద్య బృందం



నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని ప్రపంచ బ్యాంకు బృందం సోమవారం సందర్శించింది. ప్రపంచ బ్యాంకుకు చెందిన జాయ్ డే బేయర్ నేతృత్వంలో నేషనల్ హెల్త్‌మిషన్ నుంచి డాక్టర్ సునీత, టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.కృష్ణతో కూడిన బృందం ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని ఓపీ, లేబర్ వార్డు, సర్జికల్ వార్డు, ఎమర్జెన్సీ తదితర అన్ని విభాగాలను సందర్శించారు. అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ రోగులకు అందిస్తున్న వైద్యసేవలను వివరించారు. ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ కొనసాగేలా చూడండి

ఎమ్మెల్యే వసంతకు ఇంటర్ బాలికల వినతి



హైస్కూల్ ప్లస్ కొనసాగించాలని ఎమ్మెల్యే వసంతకు వివరిస్తున్న ఉపాధ్యాయులు, బాలికలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రామీణ, పట్టణ ప్రాంతాల జెడ్పీ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్ విద్య కొనసాగేలా కృషి చేయాలని పాఠశాలను సోమవారం సందర్శించిన ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌ను ఇంటర్ బాలికలు, ఉపాధ్యాయులు కోరారు. ఇటీవల కాలంలో హైస్కూల్ ప్లస్‌లను ప్రభుత్వం మూసివేస్తుందనే ప్రచారాన్ని ఆయన ముందు ఉంచారు. హైస్కూల్ ప్లస్‌లో నిరుపేద వర్గాలకు చెందిన 137 మంది బాలికలు ఇంటర్‌మీడియెట్ చదువుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. హైస్కూల్ ప్లస్‌లు కొనసాగే విధంగా విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో ఇప్పటికే మాట్లాడినట్లు తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లో బాలికల విద్యా విధానం కొనసాగేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయులు కే శ్రీదేవి, డి.నరసింహారావులను ఎమ్మెల్యే అభినందించారు.

రెడ్డిగూడెం(జి.కొండూరు): రెడ్డిగూడెం అంకమ్మ తల్లి దేవస్థానంలో సోమవారం నిర్వహించిన వార్షికోత్సవానికి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో కలిసిమెలిసి ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



నూజివీడులోని సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నూజివీడు: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి జీ రాజు డిమాండ్ చేశారు. నూజివీడులోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం వేతనాలు పెంచడం లేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చుల కింద రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన సంచార పశు వైద్య సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): అకస్మాత్తుగా తమను ఉద్యోగంలో నుంచి తొలగించటం అన్యాయమని సంచార పశు వైద్య సిబ్బంది ఆందోళన బాట పట్టారు. ఉద్యోగం నుంచి తొలగించే ముందు కనీసం ఒక నెల ముందు నోటీసు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఒక రోజు ముందు మాత్రమే ఇకపై మీకు సంస్థకు సంబంధం లేదని, సంచార వాహనాలు అప్పగించాలని వాట్సప్ ద్వారా మెసేజ్ పంపటం ఎంతవరకు న్యాయమని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గొల్లపూడి ఇఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. మాజీ సీఎం జగన్ హయాంలో తమను విధుల్లోకి తీసుకున్నందుకే కూటమి ప్రభుత్వం తమపై కక్ష కట్టిందని వాపోతున్నారు.

గంటల వ్యవధిలో ఉద్యోగులను తొలగించడం దుర్మార్గం



నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దాదాపు 2వేల మందిని ఒకేసారి తొలగించడం దుర్మార్గం. జీవీకే సంస్థ కాంట్రాక్ట్ అయిపోతే తమను తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది. కొత్తగా వచ్చే మరో సంస్థ అయినా ఈ పథకాన్ని కొనసాగించాల్సిందే కదా. లేదంటే గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు అందించే వైద్య సేవలను నిలిపేస్తారా? ఆదివారం వాట్సప్ ద్వారా నోటీసులిచ్చి సోమవారం నుంచి విధులకు రావద్దని చెప్పటం దుర్మార్గం. విధుల్లో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– బి.నరేష్, పశు సంచార వాహనం పైలెట్

ఏం జరుగుతుందో అర్థం కావటం లేదు



ఇఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌లో గత మూడేళ్ల నుంచి వెటర్నరీ వైద్యుడిగా పని చేస్తున్నాను. లేబర్ యాక్ట్ ప్రకారం కనీసం నెల రోజుల ముందు నోటీస్ ఇవ్వాల్సి ఉండగా ఒక రోజు ముందు ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు అకస్మాత్తుగా మెసేజ్ పంపటం అన్యాయం. సమస్య వచ్చినప్పుడు పరిష్కారం కోసం సీఈఓ, హెచ్ఆర్ వంటి అధికారుల దగ్గరకు వెళ్లి చెప్పుకుందామంటే వారు తరచూ మారుతున్నారు. కొత్తగా వచ్చిన అధికారులకు మళ్లీ మళ్లీ చెప్పుకోవాల్సి వస్తుంది. సంస్థలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

– డాక్టర్ వీరబాబు, నందిగామ

చాలీచాలని జీతంతో బతుకుతున్నాం..



నెలంతా కష్టపడితే రూ.10,600 జీతం. అందులో పీఎఫ్, ఈఎస్ఐ కటింగ్ పోను చేతికి వచ్చేది రూ.8,812. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అందుతున్న ప్రస్తుత తరుణంలో కుటుంబాన్ని ఎలా పోషించాలి. చాలీచాలని జీతంతో సర్దుకుపోయి ఎలాగోలా బతుకుతున్నాం. అయినా ఉన్నట్టుండి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నామని వచ్చిన మెసేజ్ చూసి షాక్‌కు గురయ్యాను. మూడేళ్ల నుంచి సేవలు అందిస్తుండగా ఇటువంటి చర్యలకు పాల్పడటం అమానుషం. అదేమని అడిగితే ప్రభుత్వ ఆదేశాలని చెబుతున్నారు. చిరుద్యోగులను తొలగించటం ప్రభుత్వ విధానమా?

– ఎం.సింధు, పారావెట్

సారా విక్రేతపై కేసు నమోదు

ముసునూరు: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా తయారు చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో సోదాలు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. మండలంలోని సూరేపల్లిలో చల్లారి గణేష్ సారా విక్రయిస్తుండడంతో సోమవారం అతని ఇంటి వద్ద సోదాలు చేసినట్టు తెలిపారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమంగా మద్యం, సారా, బెల్లం విక్రయాలు, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: ఎక్సైజ్ అధికారులు సోమవారం తిరువూరు సర్కిల్లోని గంపలగూడెం మండలంలో దాడులు నిర్వహించారు. అమ్మిరెడ్డిగూడెంలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జే శ్రీనివాస్, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఏకొండూరు మండలం గొల్లమందల తండాలో కూడా 150 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని తెలిపారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

నూజివీడు: ఆధార్ బయోమెట్రిక్ నవీకరణ, 5 ఏళ్ల లోపు పిల్లలకు నూతన ఆధార్ నమోదు కోసం మంగళవారం నుంచి మండలంలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.ఆనంద్‌బాబు సోమవారం తెలిపారు. ఈనెల 18 నుంచి 21 వరకు ఆగిరిపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌ల్లో, ఈనెల 24 నుంచి 28 వరకు ఈదరలోని జెడ్పీ హైస్కూల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆధార్ శిబిరాలను రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

యాగశాలకు శంకుస్థాపన

మక్కపేట(వత్సవాయి):దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో మక్కపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయం ప్రతిష్ఠకు సిద్ధమైంది. మార్చి 8వ తేదీ నుంచి 10వరకు ప్రతిష్ఠా కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం యాగశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ మల్లెల శివప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు కనగాల రమేష్, మాజీ సొసైటీ అధ్యక్షులు కొండబోలు బ్రహ్మం, కనగాల భాస్కరరావు, అర్చకులు కేవైఎస్ శర్మ, రాఘవశర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శుల సంఘం మండల కార్యవర్గ ఎన్నిక మండల విస్తరణాధికారి పద్మావతి పర్యవేక్షణలో సోమవారం జరిగింది. సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాసరెడ్డి (ముక్త్యాల), సాయి సంధ్య (గండ్రాయి), ఉపాధ్యక్షులుగా సంక్రాంత్, లింగయ్య, కోశాధికారిగా సైదానాయక్, సంయుక్త కార్యదర్శులుగా మంగ, రంగారావు, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, తిరుపతిరావు ఎన్నికయ్యారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

మిక్కిలి రసజ్ఞ : బొడ్డు నాగశరణ్య : బూక్యా రామ్‌నాయక్

నాగులూరు(జి.కొండూరు): కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో ఎన్టీఆర్ జిల్లా, రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరు జెడ్పీ హైస్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతున్న మిక్కిలి రసజ్ఞ, బొడ్డు నాగశరణ్య, బూక్యా రామ్‌నాయక్ ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సాయం

తిరువూరు: నేరాల నియంత్రణ కోసం తిరువూరులో పోలీసు శాఖ ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రూ.లక్షా 25 వేల సహాయాన్ని సోమవారం అందజేసింది. స్థానిక పోలీసు స్టేషన్లో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ తాళ్ళూరి రామకోటేశ్వరరావు, కొడాలి బహదూర్, కే చంద్రశేఖర్‌రెడ్డిలు తిరువూరు సీఐ గిరిబాబు, ఎస్ఐ సత్యనారాయణలకు అందజేశారు.

కాంట్రాక్టర్లు చేసిన 'ఉపాధి' పనులను రద్దు చేయాలి

జెడ్పీటీసీ సభ్యుల వినతి



నూజివీడులోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

నూజివీడు: కాంట్రాక్టర్లతో చేయించిన ఉపాధి హామీ పనులను వెంటనే రద్దు చేసి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని, కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు జెడ్పీటీసీ సభ్యులు సోమవారం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఉపాధి హామీ పనులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని పంచాయతీరాజ్ అసోసియేషన్ తరుపున గన్నవరం, బాపులపాడు, ఆగిరిపల్లి జెడ్పీటీసీ సభ్యులు అన్నవరపు ఎలిజబెత్, కొమరవల్లి భవాని, పిన్నిబోయిన వీరబాబు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులను కూలీలతో కాకుండా కాంట్రాక్టర్లతో యంత్రాలను ఉపయోగించి చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. దీనిపై పలువురు హైకోర్టుకు వెళ్లగా ఉపాధి హామీ పథకంలో 50 శాతం పనిని కూలీలతో చేయించాలని, గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారమే పనులను చేయించాలని, దీనికి విరుద్ధంగా చేసిన పనులను రద్దు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వం అనంతమైనదని చాటిన శాస్త్రవేత్త బ్రూనో



మైలవరం గౌతమ్ స్కూల్లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్




గానుగపాడు జెడ్పీ హైస్కూల్‌లో బ్రూనో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మైలవరం: సూర్య కేంద్రం వాస్తవికతను, విశ్వం అనంతమైనదని తొలినాళ్లలోనే శాస్త్రవేత్త గియోర్డానో బ్రూనో తన ప్రయోగాల ద్వారా నిరూపించినట్లు ఆప్స డెమొక్రాటిక్ గౌరవ అధ్యక్షుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎమ్.శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం గౌతమ్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త, కవి, రచయిత, వేదాంత తత్వవేత్త బ్రూనో సిద్ధాంతాలు నచ్చని నాటి ప్రభుత్వం ఆయనను 1600 సంవత్సరం ఫిబ్రవరి 17న సజీవ దహనం చేసిందన్నారు. ఈ సందర్భంగా మైలవరం గౌతమ్ పాఠశాలలో మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించి విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించారు. బ్రూనో మృతి చెందిన రోజును సత్యాన్వేషణ దినోత్సవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం బ్రూనో తన జీవితాన్ని బలిదానం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఆప్స మైలవరం నియోజకవర్గ అధ్యక్షుడు జి.మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి జి.సురేష్, కోశాధికారి కే కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ జి.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఖగోళ శాస్త్రవేత్త బ్రూనో వర్ధంతి నిర్వహించారు. సత్యాన్వేషణ దినోత్సవంగా బ్రూనో వర్ధంతి జరుపుతారని, కోపర్నికస్ ప్రతిపాదించిన సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని బలపరచినందుకు బ్రూనోను నాటి మతోన్మాదులు దారుణంగా హత మార్చారని జనవిజ్ఞాన వేదిక మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్ పేర్కొన్నారు. బ్రూనో చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ జిల్లా కార్యదర్శి రాంప్రదీప్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు



ఆగిరిపల్లి: మండలంలోని పలు ఆలయాల హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. స్థానిక శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీ కానుకలను, తోటపల్లిలోని దుగ్గిరాల బాలరావమ్మ తల్లి ఆలయంలోని హుండీ కానుకల లెక్కింపును ఆలయ ఈఓ సాయి నేతృత్వంలో నిర్వహించారు. శోభనాచలుని హుండీలో రూ.2, 67,360, దుగ్గిరాల బాల రావమ్మ తల్లి హుండీలో రూ.2,63,991 భక్తుల నుంచి కానులుగా వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాయి తెలిపారు. ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.